క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్ల జెడ్పీ హెచ్ఎస్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని గ్రామస్తులు పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతగల ఆహారం అందించాలని హెచ్ఎం శంకర్‌గౌడ్‌కు సూచించారు. అనంతరం పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనోద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, శ్రీధర్, కవిత, శివాని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమించాలి

మదనాపురం: నిరుద్యోగ హక్కుల కోసం ఉద్యమించాలని డీవైఎఫ్ఐ నాయకుడు వెంకట్‌రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో డీవైఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సహాయ కార్యదర్శి సురేష్, కమిటీ సభ్యులను నియమించారు. ఆయన మాట్లాడుతూ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండానే ఉన్న ఐటీ రంగంలో ఉద్యోగాలను ఊడదీస్తు నిరుద్యోగులతో చెలగాటమాడుతుందని ఆయన మండిపడ్డారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మతం, కులం పేరుతో విడగొడుతూ యువతను చెడుమార్గం పట్టిస్తుందని ఆయన విమర్శించారు. దేశంలో యువత హక్కులను సాధించడానికి కులం, మతం భేదం లేకుండా ఐక్యం చేసి నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



ఆత్మకూర్: జాతీయ ఆయుష్ మిషన్‌లో భాగంగా స్థానిక పాత మున్సిపాలిటీ భవనంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, మూత్రపిండ సమస్యలు, నరాల రుగ్మతలు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోషిరావ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు: తప్పిన ప్రమాదం



ఆత్మకూర్: వర్షాలకు పట్టణంలోని మూడో వార్డులోని గొల్ల బాలయ్యకు చెందిన నివాస గృహం శుక్రవారం కూలిపోయింది. రెండు రోజుల క్రితమే పరిస్థితి గమనించి ఖాళీ చేసి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ బృందం ఇంటిని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా పాత నివాస గృహాల్లో ఉంచకూడదని సురక్షితంగా ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్, ఎంపీడీఓ సుజాత సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



ఆత్మకూర్: శ్రావణమాసం మొదటి శుక్రవారం నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పుట్టలో పాలుపోసి, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని గ్రామాల్లో నాగులపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

డంపింగ్‌యార్డ్ మార్చాలని వినతి

వీపనగండ్ల: మండలంలోని బొల్లారంలో డంపింగ్‌యార్డును మార్చాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి గ్రామ కార్యదర్శి వెంకటస్వామికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో వీధి లైట్లు, పెంటకుప్పలు, మురికి గుంతల వల్ల గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని వెంటనే అధికారులు గ్రామాన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బన్న, సురేష్, మహేష్, భూపాల్, క్రాంతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యులకు ఆదేశించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే, స్వచ్ఛదనం, పచ్చదనం చివరి రోజు కలెక్టర్ మండలంలోని బాలకిష్టాపూర్, ఆత్మకూర్ మున్సిపాలిటీలో, ఖానాపూర్‌లో పర్యటించారు. వైద్యులకు పలు సూచనలు చేసి ఆస్పత్రిని పరిశీలించి రోగులతో మాట్లాడారు. నర్సరీ, పార్కులను తనిఖీ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, డాక్టర్ చైతన్యగౌడ్, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, పలువురు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

అమరచింత: గ్రామాలతో పాటు పట్టణాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంను తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీతో పాటు సింగంపేటలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని 8వ వార్డులో మటన్ మార్కెట్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులపై కమిషనర్, చైర్‌పర్సన్ కలెక్టర్‌కు వివరించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలిగినపుడు పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించడానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని మున్సిపల్ ద్వారా సోర్సు బోర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయలని కోరారు.

పచ్చదనం పై దృష్టి సారించండి

వర్షాకాలంలో పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణలో మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ప్రత్యేక అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యలయ ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆదేశించారు.

చేనేత కార్మికుడికి పలకరింపు..

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన దేవరకొండ లచ్చన్నను జిల్లా కేంద్రంలో సత్కరించిన కలెక్టర్ సత్కరించారు. శుక్రవారం అమరచింతకు వచ్చిన సందర్భంగా లచ్చన్న ఇంటికి వెళ్లి పలకరించారు. 80ఏళ్ల వయస్సులో సైతం మగ్గంపై స్వయంగా చీరలు తయారు చేస్తున్న లచ్చన్నను మర్యాదగా పెద్దాయన బాగున్నావా అంటూ పలకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేతలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని కోరారు.



లచ్చన్న నేస్తున్న చీరను చూస్తున్న కలెక్టర్

ముగిసిన ‘స్వచ్ఛదనం-పచ్చదనం’



పాన్‌గల్ మండలంలో రోడ్లను శుభ్రం చేస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి



వీపనగండ్లలో..

పాన్‌గల్: ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం మండలంలో శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు డీఆర్‌డీఓ ఉమాదేవి మండలంలోని శాగాపూర్, చిక్కేపల్లి, తెల్లరాళ్లపల్లి, తండాల్లో పర్యటించి కార్యక్రమాలను పరిశీలించి, గ్రామస్తులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. తెల్లరాళ్లపల్లి తండాలో పారిశుద్ధ్య కార్మికులను తండావాసులు ఘనంగా సన్మానించారు.

నిల్వ నీటితో రోగాలు

నిల్వ నీటితో రోగాలు వస్తాయని వారానికి ఒకసారైన శుభ్రం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా కేతేపల్లిలో పర్యటించారు. జ్వర పీడిత సర్వేను పరిశీలించి అనుమానితుల నుంచి రక్తాన్ని సేకరించాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలల్లో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి నాగేంద్రం సూచించారు. శుక్రవారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రంగాపురంలో ఎంపీడీఓ రవీంద్రతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో శుక్రవారం ఫ్రైడే -డ్రైడే సందర్భంగా అధికారుల ప్రజలకు అవగాహన కల్పించారు.

మొక్కలు నాటాలి

ఖిల్లాఘనపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి మల్లయ్య అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ రాజు అధికారులతో కలిసి కలిసి మొక్కలు నాటారు.

మురుగు నిల్వలతోనే అనర్థాలు

వీపనగండ్ల: ఇళ్ల పరిసరాలలో మురుగు గుంతలలో నీరు నిల్వ ఉండడం వల్లే పలు రకాల వ్యాధులకు కారణం అవుతున్నాయని మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం శుక్రవారం తహసీల్దార్ మురళీ, సిబ్బంది, గ్రామస్తులతో కలసి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. రాములుయాదవ్, కాడి నాగన్న, ఆడెం రాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు వితరణ



పాన్‌గల్: మండలంలోని కదిరెపాడు మండల పరిషత్, ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీహెచ్ఎం కృష్ణ ఆధ్వర్యంలో టై, బెల్టులు, పూస్ వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు, సతీష్‌కుమార్ శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. జీహెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, గణేష్, చంద్రశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దుంపాయికుంట సమస్య పరిష్కరించండి

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో నిరుపేదలకు ఇచ్చిన స్థలాలకు పొజిషన్ చూపాలంటూ కలెక్టర్ ఆదర్శ్ సురభికి సీపీఎం నాయకులు, లబ్ధిదారులు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997లో దుంపాయికుంటలో పేదలకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేసి 27ఏళ్లు అవుతున్నా పట్టాల ప్రకారం ఇంటి స్థలాలు ఎక్కడ ఉన్నాయో అర్థం కావడం లేదన్నారు. రెండేళ్ల నుంచి లబ్ధిదారులు తమకు ఇంటి స్థలాలు చూపాలంటూ గుడిసెలు నిర్మించుకుని పోరాటం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపి, అజయ్, వెంకటేష్, రమేష్, బుచ్చన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పాన్‌గల్‌లో బదిలీ ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న సిబ్బంది



గుంటిపల్లిలో హెచ్ఎం ఉమాశంకర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అలివేలు, కవితను శుక్రవారం కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయ బృందం, ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్స్‌పాల్‌కు సన్మానం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బదిలీకాగా, శుక్రవారం జిల్లా అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొత్త గొల్లశంకర్, రవికుమార్‌యాదవ్, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా సేవలు అందించి బదిలీపై వెళ్తున్న వగ్గు ఉమాశంకర్‌ను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో కేవలం 40 మంది విద్యార్థులుండే వారని హెచ్ఎం కృషి ఫలితంగా 110 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, 45 మంది గురుకులాలకు ఎంపికై నట్టు గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటన్న, గౌతమి, సౌమ్యరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో నాయకులు

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకుంటూ క్రీడల నిర్వహణపై ఆసక్తి పెంచుకోవడం సంతోషంగా ఉందని టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్ కోటపై శుక్రవారం నిర్వహించిన ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రతి సంవత్సరం కోటపై వెలసిన రామలింగేశ్వర స్వామి జాతరను నాగ పంచమి రోజు నిర్వహించడం జరుగుతుందని జాతర సందర్భంగా కబడ్డీ పోటీలను గ్రామస్తులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అయ్యుబ్‌ఖాన్, విష్ణు, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, నల్లారెడ్డి పలువురు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: చిన్నంబావి మండలం వెల్టూర్ చెందిన ఫారూక్ గత నెల 21న కొత్తకోట చౌరస్తాకు వచ్చాడు. అనుకోకుండా తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించగా ఫోన్ నారాయణపేట జిల్లా మరికల్‌లో ఓ వ్యక్తి దగ్గర ఉన్నట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి ఫోన్ తీసుకొచ్చారు. శుక్రవారం బాధితుడికి సెల్‌ఫోన్‌ను ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి అప్పగించారు.

అమరచింత: మూడు సెల్‌ఫోన్‌లను శుక్రవారం బాధితులకు అందించామని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన మహిమూద్, నందిమళ్లకు చెందిన సుస్మిత, పట్టణానికి చెందిన హరీష్ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వాటిని గుర్తించి శుక్రవారం తిరిగి అందజేశారు. ఇప్పటి వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 59 దరఖాస్తులు వచ్చాయని వీటిలో 19 ఫోన్లను బాధితులకు అందించడం జరిగిందన్నారు.

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరి చేసి శుక్రవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. జూరాల గ్రామానికి చెందిన వెంకటేష్ గతేడాది ఆగస్టు 28న ఖానాపూర్‌లో సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆచూకి కనిపెట్టి అప్పగించినట్లు తెలిపారు.

గిరిజన హక్కులు, సాంప్రదాయాలు కాపాడుకుందాం



హాజరైన పలు తండాల గిరిజనులు

పాన్‌గల్: గిరిజనుల హక్కులు, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ప్రపంచ గిరిజనుల హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు. గిరిజన తండాల్లో విద్య, వైద్యం వంటి సదుపాయాలు సక్రమంగా లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐకమత్యంతో మన హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాబు నాయక్, రవినాయక్, తులసిరావు, చిట్టెమ్మ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం



కొత్తకోటలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం లాంటివని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొ.జయశంకర్ సమావేశ మందిరంలో మదనాపురం, కొత్తకోట మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ విడతల వారీగా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికే రూ.1.50లక్షల వరకు రుణాలు ఉన్న మాఫీ చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీజే.బాబు, రావుల కర్ణాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



గోపల్‌దిన్నెలో మురికి గుంతలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: గ్రామాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోపల్‌దిన్నెలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పలు రకాల అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు. గ్రామాలలో వీధులు మురికి కూపాలుగా మారాయన్నారు. అధికారులు సమస్య పరిష్కారం కోసం క్షేత్ర పరిశీలన చేయాలన్నారు. నరసింహ, చంద్రయ్య, కురుమయ్య, రాముడు, మల్లేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పథకాల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు

మదనాపురం: ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు రంగులు దిద్దడం తప్పా అభివృద్ధి మాత్రం చేసిందేమీ లేదని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజానీకాన్ని రైతులను అయోమయంలోకి నెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ రైతుబంధు కింద రూ.7వేల కోట్లను వెచ్చించి అమలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రుణమాఫీ పేరుతో రూ.6వేల కోట్లను ప్రవేశ పెట్టడం దారుణమన్నారు. ఎంతో మంది రైతులకు రుణమాఫీ కాక బ్యాంకుల చుట్టూ తిప్పుకోవడం సరైంది కాదని రుణమాఫీ, రైతుభరోసా ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, చాంద్ పాషా, బాలు, మురళి, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య చరిత్రను తెలుసుకోవాలి



వనపర్తిలో జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వనపర్తిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

వనపర్తి టౌన్: స్వాతంత్ర్యం ఎలా వచ్చిందో ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆదిత్యరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కోట్ల రవి, ఖమర్ మియా, దివాకర్, వేణాచారి, నారాయణ, రాములు యాదవ్ పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

పెబ్బేరు రూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. సీఐటీయు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం వనపర్తి పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, సూరి, బాబు, ఆంజనేయులు, వీరన్న, అడవన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.